క్లుప్తంగా

సుబ్రహ్మణ్యస్వామికి పూజలు



ప్రత్యేక అలంకరణలో సుబ్రహ్మణ్యస్వామి

శ్రీకాకుళం కల్చరల్: గుజరాతీపేటలోని రాజరాజేశ్వరీ మహాత్రిపుర సుందరీ పీఠంలో వేంచేసిన సుబ్రహ్మణ్య స్వామికి మంగళవారం సందర్భంగా అభిషేకాలు నిర్వహించారు. పీఠం నిర్వాహకులు పెంట రామచంద్రశేఖరశర్మ ఆధ్వర్యంలో వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామికి పూజలు నిర్వహించి అలంకరణ చేశారు.

ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు



పూజలందుకుంటున్న ఆంజనేయస్వామి

ఎచ్చెర్ల: మండలంలోని కుశాలపురం గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. సింధూరాభిషేకాలను నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

సమన్వయంతో విధులు నిర్వహించాలి



మాట్లాడుతున్న ఉమామహేశ్వరరావు

జి.సిగడాం: ప్రజలకు మెరుగైన సేవలను అందించడానికి కార్యదర్శులు వీఆర్‌ఓలు సమన్వయంతో విధులను నిర్వహించాలని తహసీల్దార్ ఆర్.ఉమామహేశ్వరరావు అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం ఆదేశాల మేరకు ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన సేవలను అందించాలన్నారు. ప్రజలకు అవసరమైన ధ్రువపత్రాలు అందించాలని, ఫిర్యాదులు వస్తే తక్షణమే పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ఎస్.నిర్మల, ఆర్ఐ రామచంద్రరావు, సర్వేయర్ బెహరా చిరంజీవి కుమార్, వీఆర్వోలు భూపతి నర్సింగరావు, జగన్నాథం, సీతయ్య పాల్గొన్నారు.

ప్రశాంతంగా ప్రవేశ పరీక్ష



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న ప్రిన్సిపాల్ శామ్యూల్ లెంక

జి.సిగడాం: స్థానిక మోడల్ స్కూల్లో 7, 8, 9వ తరగతుల మిగులు సీట్లు భర్తీ కోసం మంగళవారం నిర్వహించిన ప్రవేశం పరీక్ష ప్రశాంతంగా జరిగిందని ప్రిన్సిపాల్ డాక్టర్ అన్నా శామ్యూల్ లెంక తెలిపారు. పరీక్ష కేంద్రాన్ని పరిశీలించారు. 7వ తరగతిలో ఒకటి, 8వ తరగతిలో ఐదు, 9వ తరగతిలో ఒకటి చొప్పన సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. మొత్తం 7 సీట్లుకు 70 మంది విద్యార్థులు పరీక్ష రాశారన్నారు. విద్యార్థుల మార్కులు, రిజర్వేషన్ ఆధారంగా ఖాళీలను భర్తీ చేస్తామన్నారు.

విజయగణపతికి పూజలు



ప్రత్యేక అలంకరణలో స్వామివారు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని పాలకొండ రోడ్డులో వేంచేసిన విజయగణపతి ఆలయంలో మంగళవారం సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిగాయి. ఆలయ అర్చకులు పెంట శ్రీధర్‌శర్మ, సూర్యనగేష్ శర్మల ఆధ్వర్యంలో స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. స్వామివారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.

సాగునీటి కాలువలకు మహర్దశ



సతివాడలో ప్రధాన కాలువ పనులు జరుగుతున్న దృశ్యం

- చురుగ్గా పూడికతీత పనులు

గార: సాగునీటి కాలువలకు మహర్దశ పట్టింది. ఉపాధి హామీ పథకంలో భాగంగా సాగునీటి కాలువల్లో పూడికతీత పనులకు అధికారులు ప్రాధాన్యం ఇచ్చారు. దీంతో పూడికతీత పనులు చురుగ్గా జరుగుతున్నాయి. ఖరీఫ్ సీజన్‌లో అత్యధికంగా వరి పంటను రైతులు సాగు చేస్తుంటారు. ఈ సమయంలో కాలువల్లో సక్రమంగా నీరు పారాలంటే అడ్డంకులు ఉండకూడదు. దీంతో ప్రధాన కాలువు నుంచి పిల్ల కాలువల వరకు పూడికతీత పనులు చేసేందుకు ఉపాధి హామీ పథకం అధికారులు చర్యలు చేపట్టారు. వీటితో పాటు చెరువుల్లో పూడికతీత, గట్ల పటిష్టం వంటి పనులు సుమారుగా అన్ని పంచాయితీల్లోనూ జరుగుతున్నాయి. గత వారం అన్ని పంచాయతీల్లో తొమ్మిది వేల మంది వరకు ఉపాధి హామీ వేతనదారులు పనిచేయగా, వీటిలో సగం మంది కాలువ పనుల్లో పాల్గొన్నారు. ఈ వారం ఇంకా ఎక్కువ మంది పనిచేసేలా ఉపాధి హామీ సిబ్బంది ప్రణాళిక వేశారు. రైతుల అవసరాల మేరకు పనులు చేపడుతున్నారు. ఈ వారంలో జరిగే పనుల్లో కాలువలకు ప్రాధాన్యతనిస్తున్నారు. ఇక కాలువల విషయానికొస్తే మండలంలోని 26 పంచాయతీల్లో బందరువానిపేట, కొమరవానిపేట మినహా అన్ని పంచాయతీల్లో పనులు ఊపందుకున్నాయి. భైరిదేశి గెడ్డ కాలువ ప్రారంభం నుంచి అంబళ్లవలస పంచాయతీలో దాదాపు కాలువల్లో పూడిక తీతపనులు పూర్తయ్యాయి. బూరవెల్లి, బోరవాని పేట, పూసర్లపాడు, గార, వమరవల్లి, కళింగపట్నం, కె.మత్స్యలేశంలో పనులు జోరుగా జరుగుతున్నాయి. వీటిలో శివారు ప్రాంతమైన తోనంగి పంచాయతీలో ఆలస్యంగా పనులు మొదలుకానున్నాయి. ఇక వంశధార ప్రధాన కాలువతో పాటు పిల్ల కాలువల వరకు అంపోలు, కె.సైరిగాం, గొంటి, సతివాడ తదితర పంచాయతీల్లో పనులు చేపడుతుండగా, శివారు ప్రాంతాలైన వత్సవలస ప్రాంతంలో నెమ్మదిగా జరుగుతున్నాయి. నారాయణపురం చానల్ పరిధిలో వాడాడ, రామచంద్రాపురం, గొంటి, బలరాంపురం, శ్రీకూర్మం పంచాయతీల్లో పనులు ఊపందుకున్నాయి.

అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న వైద్యురాలు ఉషశ్రీ

ఎచ్చెర్ల: వర్షాకాలం కావడంతో సీజనల్ వ్యాధులు ప్రబలుతాయని వైద్య సిబ్బంది ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని ఎచ్చెర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు మాడుగుల ఉషశ్రీ తెలిపారు. ఎచ్చెర్ల పీహెచ్‌సీలో ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలతో మంగళవారం సమావేశం నిర్వహించారు. మురికి నీరు నిల్వ లేకుండా చూడాలన్నారు. వర్షాకాలంలో దోమలు వ్యాప్తి చెందడం వల్ల మలేరియా వంటి రోగాలు వ్యాప్తి చెందుతాయన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వరి విత్తనాల కోసం పేర్ల నమోదు ప్రారంభం

గార: ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి వరి విత్తనాల కోసం రైతుల పేర్ల నమోదు ప్రక్రియ మంగళవారం నుంచి ఆర్‌బీకేల్లో ప్రారంభమైంది. మండలంలో ఈ ఏడాది 22 వేల ఎకరాల్లో వరి సాగవుతోందని అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రభుత్వం ముందస్తు అంచనా మేరకు 1380 క్వింటాళ్ల వరి విత్తనాలను అందుబాటులో ఉంచింది. వీటిలో మండల రైతాంగం ఎక్కువగా ఉపయోగించే సాంబమసూరి, స్వర్ణ వంటి రకాల్లో పాత, నూతన వంగడాలను ప్రభుత్వం అందుబాటులో ఉంచింది. రైతుల అవసరాల మేరకు ఆయా పంచాయతీల్లో ఆర్బీకేల ద్వారా వారం రోజుల్లో విత్తనాలు పంపిణీ చేయనున్నారు. రైతు ఆధా, ఫోన్ నంబర్లతో పాటు ఏ విత్తనం అవసరమన్న దాని ఆధారంగా డబ్బులు ముందుస్తుగా చెల్లించాల్సి ఉంటుంది.

హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి

జి.సిగడాం: రాజాం–శ్రీకాకుళం ప్రధాన రహదారిలో ఉన్న మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని వైఎస్సార్‌సీపీ మండల ఉపాధ్యక్షుడు పేడాడ శ్రీరామ్మూర్తి, దవలపేట గ్రామ సర్పంచ్ వడిశ మహేశ్వరరావు అధికారులను కోరారు. ఆనందపురం, వాండ్రంగి, దవలపేట, సంతవురిటి, పాలఖండ్యాం, గేదెలపేట, మెట్టవలస గ్రామాల సమీపంలో ఎక్కవగా మలుపు ఉండటంలో ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ఆనందపురం – వాండ్రంగి గ్రామాల మధ్యలో ఉన్న సారధి వంతెన నుంచి రైల్వే వంతెన వరకు భారీ మలుపు ఉండటంతో ఈ ప్రాంతాల్లో పెను ప్రమాదాలు జరుగుతున్నయన్నారు.

ఇప్పటికే సొంత నిధులతో జెంగిల్‌ను తొలిగించామన్నారు. సంబంధిత అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు.

సౌకర్యాలు కల్పించాలి



అధికారులతో మాట్లాడుతున్న వేతనదారులు

ఎచ్చెర్ల క్యాంపస్: సంతసీతారంపురం పంచాయతీ చినరావుపల్లి గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను జేఈ సి.నారాయణమ్మ మంగళవారం పరిశీలించారు. గరిష్ట వేతనం వచ్చేలా పూర్తిస్థాయిలో పనులు చేయాలని సూచించారు. సాంకేతిక సహాయకుల సూచనలు పాటించాలన్నారు. టెంట్లు, తాగునీటి వంటి సౌకర్యాలు కల్పించాలని జేఈకి వేతనదారులు విన్నవించారు. ఎండలు మండుతున్నా ఎటువంటి చర్యలూ చేపట్టడం లేదన్నారు.

మలేరియాపై అప్రమత్తం



బూర్జ: ర్యాలీ నిర్వహిస్తున్న పీహెచ్‌సీ సిబ్బంది



సారవకోట: ర్యాలీలో పాల్గొన్న వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు

సారవకోట: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది మంగళవారం దోమల నివారణపై అవగాహన ర్యాలీ చేపట్టారు. జాతీయ కీటక జనిత వ్యాధి నియంత్రణ కార్యక్రమంలో భాగంగా ఈ నెల 1 నుంచి 30వ తేదీ వరకు మలేరియా వ్యతిరేక మాసోత్సవం నిర్వహిస్తున్నామ పీహెచ్‌సీ వైద్యురాలు దేవిక తెలిపారు. దోమల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించే కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

బూర్జలో..

బూర్జ: మలేరియా వ్యాధి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని బూర్జ పీహెచ్‌సీ వైద్యుడు జి.రాజశేఖర్ అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం మలేరియా వ్యతిరేక మాసోత్సవంలో భాగంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. గ్రామాల్లో మురికి నీరు, వర్షం నీరు నిల్వ ఉండకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వర్షాకాలంలో దోమలు గుడ్లు పెట్టి అభివృద్ధి చెందకుండా నియంత్రణ చర్యలు పాటించాలన్నారు. గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టాన్నారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో ప్రజలకు అంటు రోగాలు ప్రబలకుండా తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. ఈ కార్యక్రంలో సీహెచ్‌ఓ కె.అప్పలస్వామి, హెల్త్ సూపర్‌వైజర్ టి.తేజారావు, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

గుండెపోటుతో ఇంజినీరింగ్ విద్యార్థి మృతి



సిద్ధు (ఫైల్)

నరుబుజ్జిలి: మండలంలోని మూలసవలాపురం గ్రామానికి చెందిన ఇంజినీరింగ్ విద్యార్థి తర్లాడ సిద్ధు (21) మంగళవారం గండెపోటుతో మృతిచెందాడు. హైదరాబాద్‌లో ఇంజినీరింగ్ చదువుతూ ఇటీవల సార్వత్రిక ఎన్నికలకు స్వగ్రామం వచ్చాడు. హైదరాబాద్ వెళ్తుండా మార్గమధ్యలో గుండెపోటు వచ్చి చనిపోయాడు. కుటుంబ సభ్యులు మృతదేహాన్ని గ్రామానికి తీసుకువచ్చారు. ఈయన తండ్రి సుధాకర్ సర్పంచ్‌గా పనిచేస్తూ అకాల మరణం చెందాడు. ఈయన తాత ఈశ్వరరావు ప్రస్తుతం మూలసవలాపురం సర్పంచ్‌గా కొనసాగుతున్నారు. యువకుడి మృతిపట్ల గ్రామస్తులు, బంధువులు, యువకులు ప్రగాఢ సంతాపం తెలిపారు.

విత్తన విక్రయ దుకాణాల్లో తనిఖీలు



విత్తన నిల్వలను పరిశీలిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం రూరల్: లైసెన్స్‌డ్ షాపుల్లో నకిలీ విత్తనాలు విక్రయిస్తే సంబంధిత డీలర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయాధికారిణి ఉషాకుమారి హెచ్చరించారు. మండల పరిధిలో ఉన్న పలు విత్తన విక్రయ దుకాణాల్లో మంగళవారం తనిఖీలు చేపట్టారు. సక్రమంగా విత్తనాలు విక్రయించాలన్నారు. రైతులు కూడా అప్రమత్తంగా ఉండాలన్నారు.

14న రక్తదాతలకు సత్కారం

శ్రీకాకుళం కల్చరల్: ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఈనెల 14న ప్రపంచ రక్త దాతల దినోత్సవం సందర్భంగా అధికసార్లు రక్తదానం చేసిన వారిని సత్కరించనున్నట్టు రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. 50/75/100 పర్యాయాలు రక్తదానం చేసినట్లు తగిన ధ్రువపత్రాల ఆధారాలతో ఈనెల 12వతేదీలోగా రెడ్‌క్రాస్ కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు.

19న మండల సమావేశం

ఎచ్చెర్ల క్యాంపస్: ఈ నెల 19వ తేదీన ఎచ్చెర్ల మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నారు. ఈ మేరకు ఎంపీడీఓ రమాదేవి మంగళవారం తెలిపారు. ఎంపీపీ మొదలవలస చిరంజీవి అధ్యక్షతన నిర్వహించే ఈ సమావేశానికి సభ్యులందరూ హాజరుకావాలన్నారు.

రేపటి నుంచి ప్రథమ చికిత్సపై శిక్షణ

శ్రీకాకుళం కల్చరల్: ఇండియన్ రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో ఈ నెల 13 నుంచి 15వ తేదీ వరకు రెడ్‌క్రాస్ నైపుణ్యాభివృద్ధి శిక్షణ కేంద్రంలో ప్రథమ చికిత్సపై శిక్షణ శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు చైర్మన్ పి.జగన్మోహనరావు ఒక ప్రకటనలో మంగళవారం తెలిపారు. పరిశ్రమలు, దుకాణాలలో పనిచేస్తున్న కార్మికులు, విద్యాసంస్థలలో ఉన్న విద్యార్థులు ఈ సదవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. శిక్షణకు వచ్చే ప్రతి వారు ఆంధ్రప్రదేశ్ రెడ్‌క్రాస్ యాప్ ద్వారా వలంటీర్‌గా నమోదు చేసుకోవాలని కోరారు. శిక్షణలొ పాల్గొనే వారు ఢిల్లీ రెడ్‌క్రాస్ నిబంధనల మేరకు రూ. 1500 ఫీజు చెల్లించాలన్నారు. వారు సర్టిఫికెట్ అందజేస్తారని చెప్పారు.

అందుబాటులో వరి విత్తనాలు

శ్రీకాకుళం రూరల్: రైతు భరోసా కేంద్రాల్లో వరి విత్తనాలను ప్రభుత్వ రాయితీపై అందిస్తున్నట్లు మండల వ్యవసాయాధికారిణి ఉషాకుమారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విత్తనాలు కావాల్సిన రైతులు ఆర్‌బీకేల్లో పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. ప్రస్తుతం 1546 క్వింటాళ్ల విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఎంటీయూ 1061 రకం 500 క్వింటాళ్లు, ఎంటీయూ 1046 రకం 200, ఎంటీయూ 1121 రకం 203, ఎంటీయూ 7029 రకం 300, ఎంటీయూ 1318 రకం విత్తనాలు 33 క్వింటాళ్లు అందుబాటులో ఉన్నట్టు పేర్కొన్నారు.

నేటి నుంచి యోగా శిబిరం

శ్రీకాకుళం కల్చరల్: ఇంటర్నేషనల్ యోగా డే సందర్భంగా ఈ నెల 12 నుంచి 17వ తేదీ వరకు ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఆధ్వర్యంలో యోగా ధ్యానం, శ్వాస శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు టీచర్ నంబాళ్ల కల్పన మంగళవారం తెలిపారు. రోజూ ఉదయం ఆరు నుంచి ఎనిమిది గంటల వరకు శిబిరం నిర్వహిస్తున్నామన్నారు. ఆసక్తి ఉన్నవారు తమపేర్లు రిజిస్ట్రేషన్ కోసం 95056 77388 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

ఉచిత కంటి వైద్య శిబిరం రేపు

రణస్థలం: ఈ నెల 13న మండల కేంద్రంలోని సూర్య ఆస్పత్రి సమీపంలో ఇడదాసుల విద్యా ఆరోగ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నారు. ఈ మేరకు ఫౌండేషన్ అధ్యక్షుడు ఇ.తిరుపతిరాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విశాఖపట్నం శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి వైద్యులు పాల్గొంటారన్నారు. చుట్టు పక్కల గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఘనంగా పోలమాంబ ఆలయ వార్షికోత్సవం



పూజలందుకుంటున్న పోలమాంబ అమ్మవారు



హోమాలు చేస్తున్న అర్చకులు

గార: కొర్ని గ్రామంలోని పోలమాంబ తల్లి ఆలయం పురాతనమైనది. రాతి ఆలయం నిర్మించిన తర్వాత ఏటా వార్షికోత్సవానేన్ నిర్వహిస్తుంటారు. ఇందులో భాగంగా తొమ్మిదో వార్షికోత్సవాన్ని మంగళవారం వైభవంగా జరిపారు. ఉదయం నుంచి ఆర్చకులు ప్రసాద్‌శర్మ, సతీష్‌శర్మ, అవినాష్ శర్మల అర్చకబృందం అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక అలకరణలు, హోమాలు జరిపారు. మధ్యాహ్నం ఆలయం వద్ద అన్నసమారాధన నిర్వహించారు. పోలమాంబ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు పోలమాంబను దర్శించుకున్నారు.

ప్రమాణ స్వీకారోత్సవానికి తరలిన శ్రేణులు



జెండా ఊపి బస్సును ప్రారంభిస్తున్న దానేటి శ్రీధర్

శ్రీకాకుళం అర్బన్: జనసేన పార్టీ అధ్యక్షుడు, పిఠాపురం ఎమ్మెల్యే పవన్ కల్యాణ్ బుధవారం అమరావతిలో ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు శ్రీకాకుళం నుంచి పలువురు మంగళవారం బయలుదేరి వెళ్లారు. ఈ బస్సులను జిల్లా జనసేన పార్టీ నాయకుడు డాక్టర్ దానేటి శ్రీధర్ శ్రీకాకుళంలోని ఆర్టీసీ ఒకటో డిపోలో జెండా ఊపి ప్రారంభించారు. సభకు వెళ్లిన వారంతా క్షేమంగా తిరిగి ఇళ్లకు చేరుకోవాలని ఆకాంక్షించారు.

నవధాన్యాల సాగుతో భూసారం



నవధాన్యాల సాగుపై అవగాహన కల్పిస్తున్న ఏపీఎం కూర్మారావు

ఆమదాలవలస: ఖరీఫ్‌కు ముందుగా నవధాన్యాలు సాగు చేస్తే భూసారం పెరుగుతుందని ఏపీఎం కూర్మారావు అన్నారు. స్థానిక మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో సేంద్రియ వ్యవసాయ సిబ్బందితో మంగళవారం సమావేశం నిర్వహించారు. పంటల్లో రసాయన ఎరువులు తగ్గించాలనే ఉద్దేశంతో ప్రతీ రైతు నవధాన్యాల సాగుతో పచ్చిరొట్ట ఎరువులు కలియ దున్నడం ద్వారా భూమి సారవంతం అవుతుందన్నారు. పంటకు కావలసిన నీటిని పొలంలో నిల్వ ఉంచుకునే సామర్ధ్యాన్ని కలిగి ఉంటుందన్నారు. వెలుగు, వ్యవసాయ సిబ్బంది సమన్వయంతో నవధాన్యాల విత్తనాలను పంపిణీ చేయాలన్నారు. తొలకరిలో జల్లి, దమ్ము చేయడం ద్వారా నేలకు, పంటకు చాలా ఉపయోగపడుతుందన్నారు.

ఈ కార్యక్రమంలో మండల మహిళా సమాఖ్య సిబ్బంది, క్లస్టర్ కోఆర్డినేటర్లు రామప్పడు పాల్గొన్నారు.

సేవలే గుర్తింపునిస్తాయి



త్రినాథరావును సత్కరిస్తున్న రాజశేఖర్ రెడ్డి, ఉపాధ్యాయులు

మెళియాపుట్టి: ప్రతి ఉద్యోగికీ ఉద్యోగ విరమణ సహజమని పాతపట్నం మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ అనపాన రాజశేఖర్ రెడ్డి, మండల విద్యాశాఖ అధికారులు అన్నారు. మెళియాపుట్టి మండల పరిషత్ పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా సేవలందించి ఉద్యోగ విరమణ పొందిన కె.త్రినాథరావును మంగళవారం సత్కరించారు. ఉపాధ్యాయ జీవితంలో ఎందరో విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించడానికి కృషిచేశారని కొనియాడారు. విద్యార్థుల భవిష్యత్‌ను సన్మార్గంలో నడిపే గొప్ప అవకాశం ఉపాధ్యాయులకే ఉంటుందని, ప్రదిఒక్కరూ గురువులను గౌరవించాలన్నారు. సన్మాన గ్రహీత త్రినాథరావు మాట్లాడుతూ ఇన్నాళ్ల ఉద్యోగ జీవితంలో సహకరించిన సహచర ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ–1 దేవేంద్రరావు, ఎంఈఓ–2 పద్మనాభరావు, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కమనీయం శివపార్వతుల కల్యాణం



శివపార్వతుల కల్యాణ ఘట్టం

కవిటి: మండలంలోని బొరివంకలో వెలసిన పార్వతి సమేత శ్రీరామలింగేశ్వర ఆలయంలో మంగళవారం రాత్రి శివపార్వతుల కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. స్వామివారి శీతల షష్టి తొమ్మిది రోజుల ఉత్సవాల ప్రారంభం సందర్భంగా గ్రామానికి చెందిన కొత్తపల్లి రంగారావు ఆచారి కుటుంబ సభ్యులు ఆధ్వర్యంలో కల్యాణ మహోత్సవం జరిగింది. పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చి కల్యాణాన్ని తిలకించారు. తొమ్మిది రోజులు పాటు జరిగే ఈ ఉత్సవాల్లో భాగంగా మొదట రోజు శివపార్వతుల కల్యాణంతో ప్రారంభమవుతుందని అనంతరం గ్రామంలోని పురవీధుల్లో స్వామివారిని తిరువీధి ఉత్సవాలను నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందని ఆలయ అర్చకులు తెలిపారు.